క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



మల్హర్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని తాడిచర్ల జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో ఎడ్లపల్లి మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పూర్ణచందర్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పదవ తరగతికి చెందిన సీహెచ్ వైష్ణవి, 9వ తరగతికి చెందిన మానస్వీని, 8వ తరగతికి చెందిన వీ.హాని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈనెల 28న నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో వారు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం



చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన చర్లపల్లి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య రజితతో కలిసి చదువుకున్న 2008 బ్యాచ్ పదో తరగతి మిత్రులు బాధిత కుటుంబానికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కొరపల్లి రాజేష్, దామెర రాజు, మహేష్, రాజు, కృష్ణవేణి, అపర్ణ, రసజ్ఞ, మన్విత, దివ్య, రమాదేవి, ప్రవీన్, మస్తాన్ రెడ్డి, రాజు, రంజిత్, ఓంకార్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

టేకుమట్ల: మండలంలోని సోమనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ మారెపెల్లి తిరుమల నిర్వహించారు. అనంతరం జంగిటి శివుడు అనే బాలుడి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించి పిల్లలకు పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

చిట్యాల: మండలంలోని అర్హులైన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ హేమ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(శనివారం), రేపు (ఆదివారం) స్పెషల్ క్యాంపెయన్ డేస్‌లలో భాగంగా ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. డిసెంబర్ ఒకటి జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు కొత్తగా ఓటరు నమోదు చేసుకొనుటకు గ్రామ పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్న బీఎల్‌ఓలకు ఎస్‌ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు జిరాక్స్, ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఓటరు గుర్తింపు కార్డులో ఏదైనా సవరణ కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పరామర్శ



కాటారం: మండల కేంద్రం పరిధిలోని గారెపల్లి రజకవాడకు చెందిన పున్నం సతీశ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో శుక్రవారం కాటారం మాజీ ఎంపీటీసీ తోట జనార్ధన్ బాధితుడిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. పసుల శంకర్, దేవేందర్, మహేందర్, రాజబాబు, మహేశ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పస్రా ఎస్సై కమలాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్మించిన టాయిలెట్స్ నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐ కళాశాల కొన్ని సంవత్సరాలుగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోని భవన సముదాయంలో కొనసాగుతోంది. మరుగుదొడ్లు లేకపోవడంతో కళాశాల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది విద్యార్థినుల ఆత్మగౌరవ సమస్యను వెలుగులోకి తీసుకురాగా అప్పటి కలెక్టర్ భవేశ్ మిశ్రా మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులు కేటాయించారు. పంచాయతీరాజ్ విభాగం అధికారులు నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించగా టాయిలెట్స్ నిర్మాణం పూర్తి చేశారు. కానీ బోరు, నీటి సౌకర్యం, పైప్‌లైన్ ఏర్పాటు చేయకపోవడంతో అవి వినియోగంలోకి రావడం లేదు. బిలుల్ల చెల్లింపులో జాప్యం కారణంగా మిగిలిన పనులు చేయడం లేదని కాంట్రాక్టర్ తెలిపినట్లు ఐటీఐ సిబ్బంది తెలుపుతున్నారు. దీంతో విద్యార్థినులు, కళాశాల మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. టాయిలెట్స్ అందుబాటులో లేని కారణంగా విద్యార్థినులు కళాశాలకు రాలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టాయిలెట్స్ వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకొని విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

- మండల వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మౌనిక

కాటారం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర పాఠశాలలో శుక్రవారం మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. బాలురకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల గూర్చి అవగాహన కల్పించారు. వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. తాజా కూరగాయలు, నాణ్యమైన వంట సామగ్రి వినియోగించాలని ఆహారపదార్థాలు ఎప్పటికప్పుడు వండి వేడి వేడిగా విద్యార్థులకు అందించాలని వార్డెన్‌కు సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సుమన్, ఆరోగ్య విస్తరణ అధికారి తిరుపతిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కాపర్తి రాజు, ఏఎన్‌ఎం శ్యామలత, వైస్ ప్రిన్సిపాల్ శశిధర్, ఆశ కార్యకర్తలు స్వరూపరాణి, లత, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

- ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కాళేశ్వరం: సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ, కుల గణన సర్వేను ఆపరేటర్లు తప్పులు లేకుండా డాటా నమోదు చేయాలని మహదేవపూర్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మహదేవపూర్, పలిమెల మండలాల కంప్యూటర్ ఆపరేటర్లకు, ఎన్యుమరేటర్, ఆపరేటర్లకు భూపాలపల్లి ఎంపీఎస్‌ఓ శివకృష్ణ ద్వారా ఆన్‌లైన్ డాటా ఎంట్రీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఆపరేటర్ వారికి కేటాయించిన డాటా ఎంట్రీ సెంటర్లో ప్రతిరోజు సుమారుగా 25 సర్వే ఫారంలు నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డాటా నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని, అంతే కాకుండా డాటా నమోదు సమయంలో సంబంధిత ఎన్యుమరేటర్ తప్పనిసరిగా కంప్యూటర్ ఆపరేటర్ పక్కన ఉండి తప్పులు లేకుండా డాటా నమోదు చేయించాలని సూచించారు. తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, ఎంపీఓ ప్రసాద్, పలిమెల ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్, తహసీల్దార్ ఎస్‌డీ సర్వర్,తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా బీఆర్‌ఎస్

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు



ఎస్‌ఎస్ తాడ్వాయి: పరామర్శిస్తున్న నాయకులు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు అన్నారు. మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన పార్టీ మండల సీనియర్ నాయకుడు ఎనగంటి భద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో శుక్రవారం ఆయన కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతితో కలిసి ఆయన పరామర్శించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, మేడారం జాతర మాజీ చైర్మన్లు కాక లింగయ్య, రేగ నర్సయ్య, జిల్లా యువ నాయకుడు భూక్య జంపన్న, మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు బాబురావు, శ్రీధర్, జిల్లా జాగృతి అధ్యక్షురాలు పుర్రి స్వరూప, మొక్క భాస్కర్, పత్తి గోపాల్ రెడ్డి ఉన్నారు.

మంగపేట: మండలంలోని కమలాపురానికి చెందిన తుక్కాని భాగ్యమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు శుక్రవారం పరామర్శించారు. అలాగే ఇటీవల తలకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏటూరు నాగారం మండల అధ్యక్షుడు సునీల్, మాజీ సర్పంచ్ రాంమ్మూర్తి, పీఏసీఎస్ డైరెక్టర్ రామయ్య, నర్సయ్య, తిరుపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ శ్రీహరి, మేడారం ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ చిలకమర్రి రాజేందర్ పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని పొట్లాపూర్, చింతకుంట, జంగాలపల్లి గ్రామాలకు చెందిన కాడబోయిన అనూష, ఎంచులక్ష్మీ, రాజ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు పరామర్శించారు.

చక్రవర్తిపల్లెలో పశువైద్య శిబిరం



మందులను రైతులకు అందిస్తున్న డాక్టర్ మహతి

వెంకటాపురం(ఎం): మండలంలోని చక్రవర్తిపల్లెలో పశువుల ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని శుక్రవారం నిర్వహించినట్లు లక్ష్మీదేవిపేట పశు వైద్యాధికారి మహతి తెలిపారు. ఈ సందర్భంగా 99 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 45 పశువులకు నట్టల నివారణ మందు, 124 పశువులకు గర్భస్థ వ్యాధి నివారణ మందులను పశు యాజమానులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ జగపతిరావు, సూపర్‌వైజర్ అయిలుమల్లు, గోపాల మిత్రలు రాజేందర్, దామోదర్, శ్రీనివాస్, అలేషా, పశువైద్యసిబ్బంది వేణు, తేజవర్మ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



మంగపేట: మండల కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే డాక్టర్ బీంరావ్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమ కరపత్రాన్ని అంబేడ్కర్ యవజన సంఘం మండల కమిటీ, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘాల నేత గొప్ప సమ్మారావు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారనే ఆదివాసీలకు, దళితులకే కాకుండా సబ్బండ వర్గాలకు హక్కులు, రిజర్వేషన్లు కల్పించబడ్డాయన్నారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరవుతున్నారని కార్యక్రమానికి అన్ని వార్గల ప్రజలు, అంబేడ్కర్ వాదులు, అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు పగిడిపల్లి వెంటకేశ్వర్లు, విగ్రహదాత చెల్లుపల్లి వెంకటేశ్వర్లు, విగ్రహ కమిటీ చైర్మన్ ఎంపెల్లి సమ్మయ్య, హరికృష్ణ, అంజయ్య, కబ్బాకశ్రావణ్‌కుమార్, అయ్యోరి యానయ్య, జయరాంరెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న చంద్రమౌళి

మల్హర్: మండల కేంద్రం తాడిచర్లలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీలను ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా కేసారపు నరేశ్, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర దినేశ్, మండల ఉపాధ్యక్షుడిగా మంతిని రమేశ్, కోశాధికారిగా శనిగరం రమేశ్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే మహాజన సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడిగా ఎల్లస్వామి, ప్రధాన కార్యదర్శిగా కన్నూరి సారయ్య, యువసేన అధ్యక్షుడిగా బండ రఘు, యువసేన మండల ప్రధాన కార్యదర్శిగా ఇందారపు అరుణ్, మాదిగ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడిగా ఇందారపు సిద్దు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పులిగంటి అవినాశ్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు నోముల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దోర్నాల రాజేందర్, మాది యువసేన జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతి, ఎమ్మెస్పీ జిల్లా నాయకులు అంబాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం..



నూతన కమిటీని అభినందిస్తున్న నాయకులు

కాటారం: అఖిల భారత యాదవ సంఘం దామెరకుంట గ్రామ నూతన కమిటీని శుక్రవారం డివిజన్ హడక్ కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మొగిలి లచ్చయ్య, అధ్యక్షుడిగా ముద్దం రాజుకుమార్, ఉపాధ్యక్షుడిగా సిద్ది చిన్నగట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా ముద్దం రమేశ్, కోశాధికారిగా సిద్ది పెద్దగట్టయ్య, సహకార్యదర్శిగా బోయిన సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా ఇరవేని ఓదన్న ఎన్నికయ్యారు. నూతన కమిటీకి అడ్‌హక్ కమిటీ సభ్యులు ఎన్నికపత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అడ్‌హక్ కమిటీ సభ్యులు గడ్డం చంద్రయ్య, అబ్బినవేని ఐలయ్య, గడవేన దేవేందర్, ములకల సంతోష్, తొట్ల శ్రీశైలం పాల్గొన్నారు.

నేడు నేతకాని ఆత్మగౌరవ సభ

కాళేశ్వరం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో నేతకాని మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేడు(శనివారం) నిర్వహించే నేతకాని ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని మహదేవపూర్ మండల నేతకాని కుల హక్కుల పరిరక్షణ సమితి మండల యూత్ అధ్యక్షులు కొండగొర్ల సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు నిర్వహించే సభకు నేతకాని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

రేపు మెగా వైద్యశిబిరం

ఏటూరునాగారం: మండలంలోని శంకరాజపల్లి గ్రామంలో ఈనెల 24న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరి క్లబ్ సభ్యులు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాలకుమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హనుమకొండకు చెందిన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది వైద్యులతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ప్రతి రోగికి ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న విజయ్

వెంకటాపురం(కె): త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాధనపల్లి విజయ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పంచాయతీల్లో పార్టీ అభ్యర్థులు విజయానికి కృషి చేయాలని అన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

- స్వయంకృషి సేవా సంస్థ ఫౌండర్ సతీశ్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కాటారం: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్వయంకృషి సేవా సంస్థ ఫౌండర్ కొట్టె సతీశ్ అన్నారు. మండలంలోని దేవరాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్వయంకృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుడు గద్దె సమ్మిరెడ్డి సహకారంతో స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీశ్, సమ్మిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయంలో ప్రిపరేషన్‌కు ఉపయోగపడేలా స్టడిమెటీ రియల్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు అందజేసిన సేవా సంస్థ ఫౌండర్ కొట్టె సతీశ్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుడిపాటి రమేశ్‌రెడ్డి, కామిడి వెంకట్‌రెడ్డి, కామిడి శ్రీను, అనంతుల శ్రీను, మిర్యాల శ్రీను, దావు రాజిరెడ్డి, కాల్వపెల్లి బుచ్చయ్య, దోమ భాస్కర్, గద్దె దేవేందర్, స్వయం కృషి సభ్యులు సుమన్, అఖిల్, సాయి, రవి, వేణు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

- సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్



సభ కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

టేకుమట్ల: వరంగల్ జిల్లా కేంద్రంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 6న తలపెట్టిన పీపుల్స్ మార్చ్ జన సభను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జనసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. చిట్యాల సదానందం, సాద శ్రీనివాస్, పొన్నం భిక్షపతి, శంకరాభరణం, స్వామి, సారయ్య, సమ్మయ్య పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

భూపాలపల్లి అర్బన్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీ సింగరేణి కమిటీ హాల్‌లో శుక్రవారం రెండో రోజు నిర్వహించిన సీపీఎం మూడోవ మహాసభల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనేక విధ్వంసాలకు పాల్పడుతుందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పలు కంపెనీలను ప్రైవేట్ పరం చేస్తుందన్నారు. సింగరేణి ప్రాంతంలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. జిల్లాకు రైల్వే మార్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, సింగరేణి జెన్కో ఆధారిత పరిశ్రమలైన బొగ్గు శుద్ధి, ఎరువుల, సిమెంట్ కర్మాగారాలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన సందర్భంగా సంబురాలు నిర్వహిస్తున్నారని ప్రజా సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంపేటి రాజయ్య, చెన్నూరు రమేశ్, పోలం రాజేందర్, వి రాజయ్య, గుర్రం దేవేందర్, సంఘం ప్రీతి, ఆతుకూరి శ్రీకాంత్, వందమంది మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్సైకి చెక్కు అందజేస్తున్న రాజబాబు

కాటారం: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల కోసం వ్యాపారులు, నాయకులు, యువకులు, ప్రజలు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని బయ్యారం సమీపంలోని శ్రీలక్ష్మి సూర్య ఫిల్లింగ్ స్టేషన్ యజమాన్యం సీసీ కెమెరాల కోసం రూ.10 వేలు విరాళంగా ప్రకటించారు. పెట్రోల్ పంపు యజమాని మంత్రి రాజబాబు విరాళం చెక్కును స్థానిక ఎస్సై అభినవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళాలు ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు.



మంచు దుప్పటి

వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని చొక్కాల సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున మంచు కురిసింది. శివాలయం రోడ్డు, చొక్కాల రోడ్డులో మంచు దుప్పటిలా అలుముకుంది.

\- వెంకటాపురం(కె)

